ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5




అనకాపల్లి

జిల్లా వార్తలు

శుక్రవారం 6 సెప్టెంబరు 2024

కోనాం జలాశయంలోకి 100 క్యూసెక్కుల వరద

చీడికాడ, సెప్టెంబరు 5 : మండలంలోని కోనాం జలాశయంలోకి వరద ప్రవాహం కొనసాగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లుకాగా, గురువారం 100 క్యూసెక్కుల వరదతో 99.7 మీటర్లకు చేరింది. ఆయకట్టు అవసరాల కోసం కాలువలకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు జలవనరుల శాఖ ఏఈ జైరామ్ తెలిపారు.



మెయిన్ గేట్ల ద్వారా ఆయకట్టుకు విడుదల చేస్తున్న నీరు

చెత్త నుంచి సంపద

కేంద్రాలను వినియోగంలోకి తేవాలని కూటమి ప్రభుత్వ నిర్ణయం

- గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 500 పంచాయతీల్లో ఘన, వ్యర్థ నిర్వహణ కేంద్రాలు ఏర్పాటు
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యం.. కేంద్రాలు మూసివేత
- గ్రామాల్లో అధ్వానంగా మారిన పారిశుధ్యం
- సంపద కేంద్రాలపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం
- వచ్చే నెల 2వ తేదీ నుంచి వినియోగంలోకి తేవాలని ఆదేశాలు



అనకాపల్లి మండలం తుమ్మపాలలో నిరుపయోగంగా వున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్య పరిష్కారంతోపాటు చెత్త నుంచి సంపద సృష్టించాలన్న ఉన్నతాశయాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిరీర్యం చేసింది. ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన 'చెత్త నుంచి సంపద తయారీ' కేంద్రాలు పలుచోట్ల అలంకార ప్రాయంగా మారాయి. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది.

తెలుగుదేశం పార్టీ గతంతో (2014-19) అధికారంలో వున్నప్పుడు జిల్లాలోని అన్ని మండలాల్లో దశల వారీగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అప్పట్లో సుమారు 500 పంచాయతీల్లో ఘన, వ్యర్థ నిర్వహణ కేంద్రాల (చెత్త నుంచి సంపద తయారీ) నిర్మాణం చేపట్టారు. వీధులతోపాటు ఇంటింటా చెత్త సేకరించి సంపద కేంద్రాలకు తరలించడానికి గ్రీన్ అంబాసిడర్లను (హరిత రాయబారులు) నియమించారు. కేంద్రాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి, తడి చెత్త ద్వారా వర్మీ కంపోస్టు తయారు చేసేవారు. పొడి చెత్తను స్క్రాప్ కింద విక్రయించేవారు. వర్మీ కంపోస్టు, పొడి చెత్త విక్రయం ద్వారా వచ్చే ఆదాయం నుంచి గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించి, పంచాయతీలపై ఆర్థిక భారం పడకుండా చూడాలన్నది అప్పటి ప్రభుత్వం ఉద్దేశం. జిల్లాలో పలు కేంద్రాలు విజయవంతంగా నడిచాయి. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణను గాలికొదిలేసింది. గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించలేదు. దీంతో చెత్త సేకరణ నిలిచిపోయింది. సంపద తయారీ కేంద్రాలు క్రమంగా మూతపడ్డాయి. చెత్త సేకరణకు వినియోగించే రిక్షాలు, ఆటోలు మూలకు చేరాయి. గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ నిలిచిపోయింది. మరోవైపు పంచాయతీల్లో వున్న అరకొర పారిశుధ్య సిబ్బంది అప్పుడప్పుడు వీధుల్లో సేకరించిన చెత్తను తీసుకెళ్లి ఊరు చివర రోడ్ల పక్కన, చెరువుల్లో పడేయడం మొదలుపెట్టారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలుతున్నాయి.

మళ్లీ వినియోగంలోకి సంపద కేంద్రాలు

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం... చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వినియోగంపై దృష్టి పెట్టింది. పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ తన సొంత నియోజకవర్గం పిఠాపురంలో ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు ప్రారంభించారు. పంచాయతీల్లో నిరుపయోగం పడివున్న సంపద తయారీ కేంద్రాలను పునరుద్ధరించాలని జిల్లా పంచాయతీ అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు అందడంతో ఆయా కేంద్రాల స్థితిగతులపై సమగ్ర నివేదిక రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

వినియోగంలోకి తెస్తాం...



గ్రామ పంచాయతీల్లో గతంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేంద్రాల పరిస్థితిపై సమాచార సేకరణ జరుగుతున్నది. జిల్లా కలెక్టర్ ద్వారా త్వరలో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం. అక్టోబరు 2వ తేదీ నుంచి సంపద తయారీ కేంద్రాలను పునఃప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నాం. సంపద కేంద్రాల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు రావు. పంచాయతీల ఆర్థిక సంఘం నిధుల నుంచే నిర్వహణ పనులు చేపట్టాలి. ఈ మేరకు అన్ని పంచాయతీలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం.

- శిరీషారాణి, జిల్లా పంచాయతీ అధికారి, అనకాపల్లి

భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

- పంట కాలువను తలపించిన 'పేట' మెయిన్ రోడ్డు

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్)

జిల్లాలో అనకాపల్లి, పాయకరావుపేట, ఎమంచిలి, చోడవరం నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో గురువాం మధ్యాహ్నం తరువాత భారీ వర్షం కురిసింది.

ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపగా మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి గంట పాటు భారీ వర్షం పడింది. పాయకరావుపేట మెయిన్ రోడ్డు వర్షం నీటితో పంట కాలువను తలపించింది. అనకాపల్లిలో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. పీటీడీ కాంప్లెక్స్ ఆవరణలో, విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద వర్షం నీరు నిలిచింది. చోడవరంలో బుధవారం భారీగా వర్షం పడగా, గురువారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. పలు రహదారులు, కాలనీలు నీటమునిగాయి. శివాలయం వీధిలో సుంకర సత్యవతికి చెందిన ఇంటి మిద్దె కూలిపోయింది. పాయకరావుపేట పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం కుండపోతగా వర్షం పడింది. మెయిన్‌రోడ్డు వర్షం నీటితో చెరువును తలపించింది. నక్కపల్లి మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఎస్.రాయవరం మండలంలో సుమా రు గంటపాటు భారీ వర్షం కురిసింది. జంగులూరు పంచాయతీ వెలంపాలెంలో పిడుగు పడడంతో శ్రీపాదుల అప్పారావుకు చెందిన గేదె మృతిచెందింది.

సబ్బవరంలో 60 మి.మీ.ల వర్షం

గురువారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సబ్బవరం మండలంలో 60 మిల్లీ మీటర్లు, అనకాపల్లిలో 50.6, బుచ్చెయ్యపేటలో 31, మాడుగులలో 25.4 ... మిగతా 8వ పేజీలో



భారీ వర్షంతో చెరువును తలపిస్తున్న 'పేట మెయిన్ రోడ్డు గౌతమ్ సెంటర్



తాండవ స్పిల్‌వే గేట్ల నుంచి నదిలోకి విడుదల అవుతున్న నీరు


తాండవ గేట్లు మళ్లీ ఎత్తివేత

- 1,238 క్యూసెక్కుల నీరు నదిలోకి విడుదల

నాతవరం, సెప్టెంబరు 5: పరివాహక ప్రాంతాలల తాండవ రిజర్వాయర్‌లో వరద ప్రవాహం కొనసాగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 377.9 అడుగులకు చేరింది. ముందు జాగ్రత్త చర్యగా గురువారం సాయంత్రం రెండు స్పిల్‌వేగేట్లు ఎత్తి 1,238 క్యూసెక్కుల నీటిని నీదిలోకి విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్టు డీఈఈ అనురాధ తెలిపారు. కుడి, ఎడమ కాలువల ద్వారా 225 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు.

కల్యాణపులోవలో..

రావికమతం: మండలంలోని కల్యాణపులోవ రిజర్వాయర్‌కు వరద ప్రవాహం కొనసాగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులు కాగా 80 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 459 అడుగులకు చేరింది. గురువారం రెండు గేట్లు ఎత్తి 120 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడు తున్నట్టు జలవనరుల శాఖ జేఈ సత్యనారాయణ దొర తెలిపారు. సర్పా నదిని ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు మూడు రోజుల వరకు నదిని దాటకుండా అప్రమత్తం చేయాలని ఆయా మండలాల తహసీల్దార్లను కోరినట్టు చెప్పారు.



కల్యాణపులోవ స్పిల్‌గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

చెట్టుపల్లి పీఏసీఎస్ పూర్వ కార్యదర్శిపై

చర్యలకు రంగం సిద్ధం?

సొసైటీలో రూ.70 లక్షలు అవకతవకలు

- విచారణలో నిర్ధారణ అయినా.. చర్యలకు తాత్సారం
- వెలుగులోకి తీసుకొచ్చిన 'ఆంధ్రజ్యోతి'
- సొసైటీకి సర్‌ఛార్జి ఆర్డర్ ఇవ్వడానికి డీఆర్ చర్యలు



చెట్టుపల్లి పీఏసీఎస్ కార్యాలయం

నర్సీపట్నం, సెప్టెంబరు 5:

నర్సీపట్నం మండలంలోని చెట్టుపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)లో రూ.70 లక్షలకు పాల్పడిన వారిపై చర్యలకు రంగం సిద్ధం అయినట్టు తెలిసింది. ఇందులో భాగంగా ఎలమంచిలి డివిజనల్ రిజిస్ట్రార్ ఒకటి, రెండు రోజుల్లో చెట్టుపల్లి పీఏసీఎస్‌కు సర్‌ఛార్జి ఆర్డర్ నోటీసులు జారీ చేయనున్నట్టు సమాచారం.

చెట్టుపల్లి పీఏసీఎస్ సీఈవోగా 2023 మే నెలాఖరు వరకు పని చేసిన పిట్టా చలపతిరావు సుమారు రూ.70 లక్షలు అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌తో విచారణ చేయించారు. నిధులు దుర్వినియోగం అయినట్టు విచారణ అధికారి, డివిజనల్ సహకార అధికారికి 2023 నవంబరులో నివేదిక అందజేశారు. క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నివేదికలో సిఫారసు చేశారు. కానీ చర్యలు తీసుకోవడానికి అధికారులు తాత్సారం చేశారు. ఈ ఏడాది జూలై 23న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎలమంచిలి డివిజనల్ రిజిస్ట్రార్, చెట్టుపల్లి పీఏసీఎస్‌కు సర్‌ఛార్జి ఆర్డర్ నోటీసులు జారీ చేయడానికి రంగం సిద్ధం చేశారు. సర్‌చార్జి ఆర్డర్ మీద పీఏసీఎస్ అధ్యక్షుడు ఈపీ(ఎగ్జిక్యూషన్ పిటిషన్)ని డీఆర్ కోర్టులో ఫైల్ చేస్తారు. తర్వాత డివిజనల్ రిజిస్ట్రార్.. ఒక సేల్స్ ఆఫీసర్‌ను నియమిస్తారు. నిధులు దుర్వినియోగం చేసిన పీఏసీఎస్ పూర్వ కార్యదర్శి ఆస్తులను గుర్తించి, వాటి జప్తునకు నోటీసులు జారీ చేస్తారని తెలిసింది. కాగా ఈ విషయమై ఎలమంచిలి డివిజనల్ రిజిస్ట్రార్ కిరణ్‌కుమారిని వివరణ కోరగా... రెండు రోజుల్లో అన్ని విషయాలు చెబుతానని అన్నారు.

మండుతున్న నిత్యావసరాల ధరలు

బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.60-70

- బంగాళాదుంపలు రూ.40
- వెల్లుల్లి రూ.360
- దిగిరాని పప్పుల ధరలు
- కందిపప్పు కిలో రూ.230



అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో నిత్యావసర సరకుల ధరలు మండిపోతున్నాయి. ముఖ్యంగా కూరగాయల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. అనకాపల్లి పట్టణంలో పలు కూరగాయల ధరలు కిలో 40 రూపాయలకుపైనే పలుకుతున్నాయి. సాధారణంగా ఏటా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కూరగాయ పంటల దిగుబడులు సమృద్ధిగా వుంటాయి. దీంతో ధరలు సామాన్యులకు అందుబాటులో వుంటాయి. కానీ ఈ ఏడాది జూన్‌లో, ఆగస్టు నెలలో మూడు వారాలపాటు వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, జూలైతోపాటు ఆగస్టు నెల చివరి వారంలో భారీ వర్షాలు పడడంతో కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. ఈ కారణంగానే కూరగాయల ధరలు అధికంగా వున్నాయని వ్యాపారులు అంటున్నారు.

కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వరుస వర్షాలతో పంటలకు నష్టం కలగడంతో ఆకుకూరలు, కొన్నిరకాల కూరగాయల లభ్యత తగ్గిపోయింది. బయట నుంచి వచ్చే ఉల్లి, బంగాళాదుంప, టమాటాకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో వాటి ధరలు పెరుగుతున్నాయి. ఉల్లిపాయల ధర రోజురోజుకీ పెరుగుతున్నది. అవి కూడా తడిసి, కుళ్లిపోయి నాణ్యత వుండడంలేదు. రేటు పెరగడమే దీనికి కారణం. మహారాష్ట్ర నుంచి ఉల్లి తెప్పిస్తారు. అక్కడ రేట్లు పెరిగాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వమే రాయితీ ధరపై విక్రయిస్తోంది. గత రెండు వారాల నుంచి ఉల్లి ధరలు పెరుగుతూ ఇప్పుడు రూ.60-70కి చేరాయి. విశాఖలోని రైతు బజార్లలో గురువారం కిలో ఉల్లి రూ.50కి విక్రయించారు. కానీ అనకాపల్లి జిల్లాలో ఎక్కడా రైతుబజార్లు లేకపోవడంతో వినియోగదారులు ప్రైవేటు వ్యాపారుల నుంచి ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తున్నది. ఇక టమాటా ధరలు తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతున్నాయి. వారం రోజుల క్రితం వరకు కిలో రూ.30కి ఇప్పుడు కిలో రూ40కి అమ్ముతున్నారు. కొద్ది రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో టమాటా పంట దెబ్బతింటున్నదని, రానున్న రోజుల్లో ధర ఇంకా పెరుగుతుందని అంటున్నారు. బంగాళాదుంపల ధర దిగి రావడం లేదు. కిలో రూ.40 చొప్పున అమ్ముతున్నారు. బీరకాయలు కిలో రూ.50, తెల్లవంకాయలు రూ.40, నల్లవంకాయలు రూ.40, దొండకాయలు రూ.30, బెండకాయలు రూ.50, పచ్చిమిర్చి రూ.80, ఆనపకాయ (చిన్నది) రూ. 20, చేమదుంపలు రూ.50, క్యారట్ రూ.50, చిక్కుడుకాయలు రూ.80, గోరుచిక్కుడు రూ.40, క్యాబేజీ రూ.40, క్యాలీఫ్లవర్ రూ.80లకు విక్రయిస్తున్నారు. వెల్లుల్లి ధరలు ఇటీవల బాగా పెరిగాయి. ఇవి కూడా రూ.360 చొప్పున విక్రయిస్తున్నారు. కొత్తమీర, తోటకూర, పాలకూర, గోంగూర తదితర ఆకు కూరల ధరలు పెరిగాయి.

పప్పుల ధరలు కూడా పెరుగుతున్నాయి. కందిపప్పు ధర పెరిగిందని నెల రోజుల క్రితం విశాఖలోని రైతు బజార్లలో కిలో రూ.150 చొప్పున అధికారులు విక్రయించారు. కానీ ఈ సౌలభ్యం అనకాపల్లి జిల్లాలో లేదు. దీంతో కిరాణా దుకాణాల్లో రకాన్నిబట్టి కిలో రూ.200 నుంచి 230 వరకు అమ్ముతున్నారు. మినపప్పు రూ.160, పెసరపప్పు రూ.150 ఇలా అన్నీ పెరిగిపోయాయి.

అచ్యుతాపురంలో స్పోర్ట్స్ స్టేడియం

సెజ్ పునరావాస కాలనీలో అందుబాటులో స్థలం

- జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే సుందరపు
- స్థలాన్ని పరిశీలించిన అధికారులు
- తొమ్మిది ఎకరాల్లో ఓపెన్ స్టేడియం, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్
- 20 ఎకరాల చెరువులో బోట్ షికార్



పునరావాస కాలనీలో ఖాళీ స్థలాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 5:

స్థానిక ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పునరావాస కాలనీ(దిబ్బపాలెం)లో జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్టేడియం నిర్మించడానికి అధికారులు గురువారం స్థల పరిశీలన చేశారు. స్పోర్ట్స్ స్టేడియం నిర్మించడానికి సరిపడ స్థలం జిల్లా కేంద్రానికి సమీపంలోని అచ్యుతాపురంలో ఉందని, దానిని పరిశీలించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఇటీవల జిల్లా కలెక్టర్‌ని కోరారు. ఈ మేరకు గురువారం స్థల పరిశీలనకు రావాల్సి వుంది. అయితే అనివార్య కారణాల వల్ల కలెక్టర్ రాలేకపోవడంతో ఇతర అధికారులు వచ్చారు. అచ్యుతాపురం రాంబిల్లి మండలాలకు చెందిన సెజ్ నిర్వాసితులకు దిబ్బపాలెం వద్ద 500 ఎకరాలను కేటాయించారు. ఇక్కడ నిర్వాసితులకు స్థలాలు ఇవ్వగా, ఇంకా స్థలం ఖాళీగా వుంది. జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్టేడియం నిర్మించడానికి ఈ స్థలం ఎంతో అనువుగా వుంటుందని ఎమ్మెల్యే భావించి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఏడు ఎకరాల్లో ఓపెన్ స్టేడియం, ఒక ఎకరంలో ఇండోర్ స్టేడియం, ఒక ఎకరంలో స్విమ్మింగ్ పూల్, 20 ఎకరాల చెరువులో బోట్ షికార్ వంటివి ఏర్పాటు చేయవచ్చని సెజ్ పునరావాస కాలనీ అభివృద్ధి కమిటీ చైర్మన్ భైలపూడి శ్రీరామదాస్, ఆయా స్థలాలను అధికారులకు చూపించారు. ఈ పర్యటనలో కలెక్టర్ సీసీ రాజేశ్ డీఏస్‌డీఓ రమణ, ఆర్అండ్‌బీ ఈఈ రమేశ్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

రౌడీ షీటర్లు, చెడు నడత ఉన్నవారిపై నిఘా

జిల్లా ఎస్పీ దీపిక.. ఎలమంచిలి స్టేషన్ సందర్శన

ఎలమంచిలి, సెప్టెంబరు 5: 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక పోలీసులకు సూచించారు. ఆమె గురువారం ఎలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో నేరాలకు సంబంధించిన కేసుల గురించి ఆరా తీశారు. పెండింగ్ కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలన చేసి, ఆయా కేసుల పురోగతి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయాలని, రోడ్డు భద్రత నియమాలపై యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధానంగా మైనర్లు డ్రైవింగ్ చేయకుండా చూడాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నివారించడంతోపాటు విజిబుల్ పోలీసింగ్ ... మిగతా 8వ పేజీలో



ఎలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ ఎం.దీపిక

విద్యార్థులకు ఉపాధ్యాయులే రోల్ మోడల్

- గురుపూజోత్సవంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ - 7లో

క్రైం... crime news

చేపల వేటకు వెళ్లిన గిరిజనుడి మృతి


గెమ్మెల భీమరాజు(ఫైల్)

అనంతగిరి, సెప్టెంబరు 5: చేపల వేటకు వెళ్లి గల్లంతైన గిరిజనుడు మృత్యువాత పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలోని భీంపోలు పంచాయతీ బీటుగరువు గ్రామానికి చెందిన నలుగురు గిరిజనులు విజయనగరం జిల్లా మెంటాడ మండలం అండ్రా డ్యామ్ వద్దకు మంగళవారం రాత్రి చేపల వేటకు వెళ్లారు. చేపల వేట సాగిస్తుండగా గెమ్మెల భీమరాజు(22) గల్లంతయ్యాడు. దీంతో ముగ్గురు గిరిజనులు భయంతో ఇంటికి వచ్చేశారు. గురువారం ఉదయం డ్యామ్ వద్ద మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసుల విచారణలో చేపల వేటకు వచ్చి గల్లంతు అయినట్టు గుర్తించారు. మృతదేహానికి విజయనగరం ఆస్పత్రిలో పోసుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సినర్జిన్ ఫార్మా ప్రమాదంలో మరొకరి మృతి

నాలుగుకు చేరిన మృతుల సంఖ్య


మృతుడు ఓయబోస్ కొరహ్ (ఫైల్ ఫొటో)

పరవాడ, సెప్టెంబరు 5 : ఇక్కడి ఫార్మాసిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యూనిట్ -3లో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓయబోస్ కొరహ్ (21) గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. గత నెల 22వ తేదీ అర్ధరాత్రి సినర్జిన్ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. వీరిలో విజయనగరం జిల్లాకు చెందిన కెమిస్ట్‌తో పాటు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు హెల్పర్లు తీవ్రంగా గాయపడడంతో విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వీరిలో కెమిస్ట్‌తో పాటు జార్ఖండ్‌కు చెందిన ఇద్దరు హెల్పర్లు రోజుల వ్యవధిలో మృతి చెందారు. 90 శాతం గాయాలతో చికిత్స పొందుతున్న ఓయబోస్ కొరహ్ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇతడికి భార్య సౌమ్య కొరహ్, మూడు నెలల పాప ఉన్నారు. మృతదేహానికి గురువారం కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు సీఐ ఆర్.మల్లికార్జున రావు తెలిపారు.

ఏవోబీలో 1,100 కిలోల గంజాయి డంప్ స్వాధీనం

సీలేరు, సెప్టెంబరు 5: ఆంధ్రా-ఒడిశా బోర్డర్ (ఏవోబీ)లో 1,100 కిలోల గంజాయి డంప్ లభ్యమైందని కలిమెల పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కలిమెల స్టేషన్ పరిధిలోని పప్పులూరు పంచాయతీలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు బుధవారం నుంచి కెందుగూడ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలను చేపట్టారు. అటవీ ప్రాంతంలో ఒకచోట అనుమానం వచ్చి తవ్వి చూడగా 1,100 కిలోల గంజాయి లభ్యమైందని కలిమెల పోలీసులు తెలిపారు. గంజాయిపై ఇటీవల ఆంధ్రా, ఒడిశా పోలీసులు ఉక్కుపాదం మోపడంతో స్మగ్లర్లు అటవీ ప్రాంతంలో దాచి ఉంటారని భావిస్తున్నారు. గంజాయి డంప్ ఎవరిదన్న కోణంలో ఒడిశా పోలీసులు సమీప గ్రామాల్లో ఆరా తీస్తున్నారు.

గర్భిణికి తప్పని అవస్థలు

- పల్లకిలో రెండు కిలో మీటర్లు తరలింపు
- రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు


పల్లకిలో గర్భిణిని ఆస్పత్రికి తీసుకు వెళుతున్న దృశ్యం

వుుంచంగిపుట్టు, సెప్టెంబరు 5: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కిమలమామిడి గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామానికి చెందిన గర్భిణికి గురువారం పురిటి నొప్పులు రావడంతో సుమారు రెండు కిలోమీటర్లు పల్లకి సాయంతో ప్రధాన రహదారికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి ఆటోలో ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షుడు పి.రామదాసు మాట్లాడుతూ తమ గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులకు వినతులు అందించినా స్పందన కానరాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఏ చిన్నపాటి వ్యాధి సోకినా డోలీ మోతలు తప్పడం లేదని వాపోయారు. పాలకులు, అధికారులు స్పందించి పక్కా రహదారి నిర్మాణం జరిగేలా చూడాలని ఆయన కోరారు.

వినూత్నంగా 'వానపల్లి' వినాయకుడు

- 1116 మట్టి విగ్రహాలు, చిరుధాన్యాలు, ఎండు ఫలాలతో ఏకదంతుడు


వాసు రూపొందించిన వినూత్న వినాయకుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 5: పట్టణానికి చెందిన స్వర్ణకారుడు ఎండు ఫలాలు, చిరు ధాన్యాలు, చిన్న చిన్న మట్టి ప్రతిమలు ఉపయోగించి మట్టి వినాయకుడుని అద్భుతంగా రూపొందించాడు. స్థానిక డాన్‌బాస్కో స్కూలు రోడ్డులో నివాసం ఉంటున్న స్వర్ణకారుడు వానపల్లి వాసు ప్రతి ఏటా వినాయకచవితికి వినూత్న రీతిలో వినాయకుడి విగ్రహాలు తయారు చేస్తుంటారు. ఈ ఏడాది శాంతినగర్ మండపంలో ఏర్పాటు చేయడానికి ఉత్సవ కమిటీ అభ్యర్థన మేరకు 15 రోజులు కష్టపడి ఆకర్షణీయంగా ఏక దంతుడు విగ్రహాన్ని రూపొందించారు. ఇందుకోసం కోటవురట్లలో మూడున్నర అడుగులు మట్టి విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించారు. దీనికి తోడు వానపల్లి వాసు 1116 చిన్న చిన్న మట్టి విగ్రహాలు అచ్చు పోశారు చిన్న మట్టి విగ్రహాలు, ధాన్యం, సబ్జా గింజలు, ఆవాలు, గసగసాలు, బాదం, ఎర్ర కంది పప్పును మూడున్నర అడుగుల మట్టి విగ్రహానికి అద్ది గణనాథునికి సరికొత్త రూపంలో ఆవిష్కరించాడు.

గరిష్ఠ స్థాయికి పెద్దేరు జలాశయం

మాడుగుల రూరల్, సెప్టెంబరు 5 : మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువగా ఉంది. ఇక్కడ గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు. కనిష్ఠం 125.85 మీటర్లు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో జలాశయంలో నీటినిల్వలు పుష్కలంగా ఉన్నాయి. గురువారం సాయంత్రానికి 225 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో జలాశయం నీటిమట్టం 136.20 మీటర్లకు చేరింది. వర్షంనీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరడంతో గరిష్ఠ స్థాయికి చేరువవుతోంది. కుడి, ఎడమ కాలువకు 100 క్యూసెక్కుల నీరు విడిచిపెడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి తొమ్మిది గంటలు దాటిన తర్వాత 350 క్యూసెక్కుల నీటిని గేటు తెరిచి విడిచిపెట్టినట్టు ఏఈ సుధాకర్ రెడ్డి తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

విద్యార్థులకు ఉపాధ్యాయులే రోల్ మోడల్

- మంచి సమాజాన్ని నిర్మించడంలో టీచర్ల పాత్ర కీలకం
- గురుపూజోత్సవంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్
- 38 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే కొణతాలతో కలిసి ఘన సత్కారం


సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5: మంచి సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా జిల్లా స్థాయి గురుపూజోత్సవాన్ని పట్టణంలోని గాంధీనగరం ఎస్‌ఆర్ శంకరన్ సమావేశమందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమెతో పాటు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సర్వేపల్లి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో పిల్లలు ఉపాధ్యాయులనే రోల్ మోడల్‌గా చూస్తారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యను అందించడంతో పాటు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. పిల్లలకు అర్థమయ్యేలా, మనసుకు హత్తుకునేలా విద్యాబోధన ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు చెప్పిన విషయాలకంటే, ఉపాధ్యాయులు ఏం చెబితే అది నిజమని విద్యార్థులు నమ్ముతారన్నారు. అందువల్లే విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంటుందని ఆమె వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గురుపూజోత్సవాన్ని స్వచ్ఛమైన తెలుగు సంస్కృతంలో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. జిల్లా అధికారులలో సగంపైగా మహిళలే ఉన్నారని, వారికి ఓర్పు, సహనం ఎక్కువగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో పొందిన అనుభూతి, సంతృప్తి మరే ఇతర వృత్తులలో ఉండదని వివరించారు. నిత్య విద్యార్థి అంటే ఉపాధ్యాయులేనన్నారు. విద్యా ప్రమాణాలలో మార్పు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మట్టి నుంచి మాణిక్యాలను తయారు చేయగలిగే శక్తి ఉపాధ్యాయ వృత్తికే సాధ్యమని స్పష్టం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డీఈవో పి.అప్పారావు తదితరులు ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యాబోధనలో ఉత్తములుగా నిలిచిన ముగ్గురు ప్రధానోపాధ్యాయులు, 17 మంది స్కూల్ అసిస్టెంట్లు, 18 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లను సర్టిఫికెట్లు, మెమెంటోలతో కలెక్టర్, ఎమ్మెల్యే డీఈవో సత్కరించారు. కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణలను విద్యాశాఖాధికారులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులతో పాటు జిల్లాలో గల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సత్కారం పొందిన ఉపాధ్యాయులతో కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈవో

ప్రశాంత వాతావరణంలో సదరం శిబిరం

- పరిశీలించిన ఎమ్మెల్యే కొణతాల
- వైద్య సిబ్బందికి సూచనలు


దివ్యాంగుల వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5: సదరం క్యాంపును గురువారం ఇక్కడ ప్రశాంతంగా నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ క్యాంపు గందరగోళంగా మారడంతో మండలాల వారీగా ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించడం ప్రారంభించారు. ఈ శిబిరానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరై పరిశీలించారు. దివ్యాంగులను నేరుగా కలిసి వారితో మాట్లాడారు. ఎటువంటి సమస్యలు రాకుండా పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. 200 మందికి పైగా హాజరైన దివ్యాంగుల్లో 65 మందికి పరీక్షలు జరిపి గుర్తించడం జరిగిందని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ శిబిరానికి మానసిక వైకల్యం పొందినవారు, చెముడు, మూగవారు అధికంగా వస్తున్నారని వారికి ఈ శిబిరంలో అవకాశం లేదని డాక్టర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. అందువల్ల శిబిరానికి వచ్చి ఇబ్బంది పడొద్దని వారికి సూచించారు. ఈ శిబిరానికి హాజరైన దివ్యాంగులకు 82వ వార్డు జనసేన ఇన్‌చార్జి ఆళ్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు జనసేన నాయకులు మళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

సంక్షేమ హాస్టళ్లకు దోమతెరలు : కలెక్టర్

అనకాపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు దోమ తెరలను అందిస్తున్నామని కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పరిశ్రమల యాజమాన్యాల సామాజిక బాధ్యత నిధులతో వీటిని సమకూర్చుతున్నట్టు వివరించారు. జిల్లాలో వివిధ కంపెనీల యాజమాన్యాల ద్వారా 30 వేల దోమ తెరలను సేకరించి, వీటిలో 20 వేల దోమ తెరలను ఏఎస్‌ఆర్ జిల్లాలో గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు పంపామని వెల్లడించారు. ఈ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల హాస్టళ్లకు 10 వేలు దోమ తెరలను కేటాయించామని ఆమె పేర్కొన్నారు.

నాలుగు మండలాల్లో కుండపోత

- భారీ వర్షంతో ఎటుచూసినా నీరే
- అవస్థలకు గురైన జనం
- లోతట్టు ప్రాంతాల్లో మరీ దారుణం
- అనకాపల్లిలో 40 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు


పాయకరావుపేటలో కుండపోత


వర్షపునీటితో చెరువును తలపిస్తున్న కశింకోట పీహెచ్‌సీకి వెళ్లే ప్రధాన రహదారి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా పలు మండలాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. అనకాపల్లి పట్టణంలో మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో భారీ ఉరుములతో కుండపోతగా పడింది. దీంతో జనజీవనం స్తంభించింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా పీటీడీ కాంప్లెక్స్ ఆవరణ చెరువును తలపించింది. విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి కింద వర్షపునీరు చేరుకోవడంతో ఈ మార్గంలో వాహనచోదకులు రాకపోకలకు పడ్డారు. సబ్‌వేల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కశింకోట: మండలంలో గురువారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో ఎటుచూసినా జలమే కనిపించింది. ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని వెళ్లే ప్రధాన రహదారులు చెరువును తలపించాయి. డ్రైనేజీలు లేక వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచిపోవడంతో జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 22.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందని మండల వ్యవసాయాధికారిణి స్వప్న తెలిపారు.

పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్: మండలంలో భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపినప్పటికీ మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు ఏర్పడి కుండపోతగా పడింది. దీంతో మెయిన్ రోడ్డులోని గౌతమ్, చిత్రమందిర్, లక్ష్మీ థియేటర్ సెంటర్లు చెరువును తలపించాయి. సత్యవరం, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, గోపాలపట్నం, రాజగోపాలపురం, కుమారపురం, మాసాహెబ్‌పేట, మంగవరం, అరట్లకోట, కేశవరం, తదితర గ్రామాల్లో ఎటు చూసినా నీరే కనిపించింది.

నక్కపల్లి: వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఒడ్డిమెట్ట, దేవవరం, గొడిచెర్ల, డొంకాడ, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు, వేంపాడు, నెల్లిపూడి, డీఎల్‌పురం తదితర గ్రామాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. వరి పొలాల్లో భారీగా నీరు చేరింది.


నక్కపల్లి మండలం గొడిచెర్ల హైవేపై...

సింహాద్రి రెండో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, సెప్టెంబరు 5: సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో ఉత్పత్తికి గురువారం ఉదయం అంతరాయం ఏర్పడింది. ఇదే యూనిట్‌కు సంబంధించి బాయిలర్ ట్యూబ్‌ల్లో రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి అర్ధంతరంగా నిలిచిపోయింది. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభించారు. రెండు రోజుల్లోగా యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇదిలావుంటే మిగతా ఒకటి, మూడు, నాలుగు యూనిట్లలో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు తెలిపారు.

11న ఏపీ అభ్యుదయ రచయితల సంఘం మహాసభ

కొత్తూరు, సెప్టెంబరు 5: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రథమ మహాసభ ఈ నెల 11న జరగనుందని ఆ సంఘం ప్రతినిధి జీఎల్‌ఎన్ శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో సాయంత్రం ఆరు గంటలకు జరగనున్న ఈ సభకు అరసరం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని వివరించారు. సాహితీవేత్తలు, అనకాపల్లి ప్రముఖులు సభను విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

సీనియర్ న్యాయవాదులకు సన్మానం


సీనియర్ న్యాయవాదిని సన్మానిస్తున్న న్యాయమూర్తులు

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 5: గురు పూజోత్సవం సందర్భంగా కోర్టు సముదాయంలో సీనియర్ న్యాయవాదులను సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్‌ఖాన్, జూనియర్ సివిల్ జడ్జి రోహిత్ గురువారం ఘనంగా సన్మానించారు. 1956లో కోర్టు ఏర్పాటు చేసిన నాటి నుంచి న్యాయవాద వృత్తిని కొనసాగించి స్వర్గస్తులైన 26 మంది చిత్రపటాలను అసోసియేషన్ సమావేశ మందిరంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్టా ప్రభాకర్, కార్యదర్శి అనిమిరెడ్డి శివకృష్ణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి రామశేషు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు బాసట

- జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు రూ.43.25 లక్షలు అందజేత
- కలెక్టర్ విజయకృష్ణన్ వెల్లడి

అనకాపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విజయవాడలో కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు జిల్లాలో పరిశ్రమల యాజమాన్యాల తరఫున ఇప్పటి వరకు రూ.43.25 లక్షలు సాయంగా అందజేసినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎసెన్షియా అడ్వాన్స్‌డు సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ రూ.5లక్షలు, రాంకీ ఫార్మాసిటీ ఇండియా లిమిటెడ్ కంపెనీ రూ.10లక్షలు, అశుర్దన్ ఫార్మా రూ.లక్ష, నోటఫోర్ అడ్వాన్స్‌డు రూ.75వేలు, డెల్టా మెరైన్ ఇంజనీర్స్ రూ.20 వేలు, సాగర్ సిమెంట్స్ రూ.లక్ష, దక్కన్ కెమికల్స్ రూ.10 లక్షలు, హెటిరో ఫౌండేషన్ రూ.10 లక్షలు, డల్వకాట్ బయో రూ.20 వేలు, అచ్యుతా లేబొరేటరీస్ రూ.10వేలు, విజయశ్రీ ఆర్గానిక్స్ రూ.5 లక్షలు విరాళాలు అందజేసినట్టు ఆమె వివరించారు. పరిశ్రమల యాజమాన్యాల ద్వారా అందిన విరాళాలను ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపుతున్నట్టు పేర్కొన్నారు.

కూలిన కూండ్రం పాఠశాల ప్రహరీ గోడ


కూండ్రంలో కూలిపోయిన ఎంపీయూపీ పాఠశాల ప్రహరీ గోడ

కొత్తూరు, సెప్టెంబరు 5: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అనకాపల్లి మండలంలోని కూండ్రం ఎంపీయూపీ పాఠశాల ప్రహరీ గోడ కూలిపోయింది. గ్రామంలో మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న యాదగిరి చెరువుకు వెళ్లే ప్రధాన కాలువ కప్పివేయడంతో వర్షపు నీరు ప్రాథమిక పాఠశాల గోడ వద్ద తిష్ఠ వేసింది. దీనికితోడు వర్షం వచ్చినప్పుడల్లా ఈ నీటి ఉధృతి మరింత పెరగడంతో చెత్తాచెదారం ఇక్కడకు కొట్టుకువస్తోంది. దీంతో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి గోడ ఒక్కసారిగి కూలిపోయింది. అయితే రాత్రి ఈ ఘటన జరగడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రహరీ గోడను పునర్నిర్మించడంతో పాటు ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

రావణాపల్లి ఆయకట్టుకు నీరు విడుదల

గొలుగొండ సెప్టెంబరు 5: రావణాపల్లి రిజర్వాయర్ గేట్లు ఎత్తి నర్సీపట్నం మునిసిపాలిటీ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ గురువారం సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ నర్సీపట్నం, గొలుగొండ మండలాలకు చెందిన సుమారు మూడు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా ఉండడంతో ఖరీఫ్, రబీ పంటల సాగుకు సాగునీరు పుష్కలంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం 215 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్‌లో పూడిక తొలగించి నీటి నిల్వలు ఉండేవిధంగా ఇప్పటి ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషి చేశారన్నారు. వచ్చే ఏడాది రిజర్వాయర్ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి, కొల్లి సత్తిబాబు, కర్రి నాయుడు, ధనిమిరెడ్డి మధు, పెట్ల బాబులు, ఇరిగేష్ ఏఈ సూర్య తదితరులు పాల్గొన్నారు.

'సింహాద్రి' గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఎన్ఎస్‌డబ్ల్యూయూ ఘన విజయం


ఎన్ఎస్‌డబ్ల్యూయూ అధ్యక్ష, కార్యదర్శుల విజయోత్సవం

పరవాడ, సెప్టెంబరు 5 : సింహాద్రి ఎన్టీపీసీ ప్లాంట్‌లో గురువారం నిర్వహించిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఎన్టీపీసీ సింహాద్రి వర్కర్స్ యూనియన్ (ఎన్ఎస్‌డబ్ల్యూయూ) ఘన విజయం సాధించింది. మొత్తం 197 ఓట్లు పోలవ్వగా ఎన్ఎస్‌డబ్ల్యూయూకి 117 ఓట్లు, ప్రత్యర్థి ఎన్టీపీసీ సింహాద్రి మజ్దూర్ యూనియన్ (ఎన్ఎస్ఎంయూ)కి 80 ఓట్లు వచ్చాయి. 37 ఓట్ల మెజార్టీతో ఎన్ఎస్‌డబ్ల్యూయూ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి బీబీ పాత్ర ప్రకటించారు. దీంతో ఈ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా బండారు శ్రీధర్‌నాయుడు, జి.శంకర్‌వర్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విజేతలను టీఎస్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాసవరపు అప్పలనాయుడు తదితరులు అభినందించారు.


ఎస్.రాయవరం : డి.అగ్రహారం పాఠశాలలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

గురువులకు వందనం

▸▸ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురుపూజోత్సవం ▸▸ ఉపాధ్యాయులకు ఘన సత్కారం ▸▸ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు


అనకాపల్లి మండలం కొత్తూరు పాఠశాలలో గురువులకు సత్కారం


రాంబిల్లిలో జరిగిన వేడుకల్లో సీఐ, డీటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు


అనకాపల్లి డైట్ కళాశాలలో సర్వేపల్లి విగ్రహం వద్ద రత్నాకర్ నివాళి


అచ్యుతాపురం గ్రంథాలయంలో సర్వేపల్లి చిత్రపటం వద్ద అంజలి


పాయకరావుపేటలో విశ్రాంత ఉపాధ్యాయుడ్ని సన్మానిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5 : ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనకాపల్లిలో ఈ వేడుకలు మరింత వైభవోపేతంగా జరిగాయి. డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో చైర్మన్ దాడి రత్నాకర్ విశ్రాంత ఉపాధ్యాయుడు పి.విజయబాబును సత్కరించారు. వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు. రైతుభారతి ఆడిటోరియంలో సర్వేపల్లి రాధాకృష్ణ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడు యల్లపు శ్రీరాములను చైర్మన్ రత్నాకర్ సత్కరించారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు కొణుతుల నారాయణరావును సంఘ కార్యాలయంలో సత్కరించారు. స్థానిక యూనియన్ బ్యాంక్ గవరపాలెం బ్రాంచ్‌లో బీఎం దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు కేఎస్‌వీ సత్యనారాయణ, ఎస్.శంకరరావు, కేవీ గౌరీపతి, విశ్రాంత అధ్యాపకుడు విల్లూరి అప్పలస్వామినాయుడులను సత్కరించారు. అసిస్టెంట్ మేనేజర్ స్రవంతి, రాజు, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు. అలాగే, పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఈ వేడుకలను జరిపారు. అలాగే, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్‌బ్రాంచ్‌లో గురువారం గురుపూజోత్సవం సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆళ్ల ఓంరామ్‌ను సత్కరించారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ కె.జగదీశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ పి.జయప్రకాష్, గాంధీనగరం జీవీఎంసీ పాఠశాల హెచ్ఎం డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండల కేంద్రమైన కశింకోటలో విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాము సూర్యనారాయణ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దివంగత ఉపాధ్యాయులు కందులు శ్రీరామమూర్తి భార్య జ్ఞాపకార్థం రూ.25వేలు సంఘం అభివృద్ధికి విరాళంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బి.రామకృష్ణ, కందుల శివాజీ, పి.నాగేశ్వరరావు, రామచంద్రరావు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, స్థానిక ప్రాథమిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన టీచర్స్ డేలో టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్,ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పాయకరావుపేటలో నిర్వహించారు. శాఖా గ్రంథాలయంతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేడుకల్లో విశ్రాంత ఉపాధ్యాయులు ఆర్.వి.రత్నంను సత్కరించారు. తేజోమూర్తుల వెంకటేశ్వరరావు, ఎస్.సీతారామమూర్తి, ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు, ఎన్‌టీ సీతారామమూర్తి, యోగా గురువు ప్రసాద్, అచ్యుతరావు, కె.సత్తిబాబు, ధనిశెట్టి తులసీరామ్ పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని అనేక పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చినదొడ్డిగల్లు గ్రామంలో చందక శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ఎంఈవో నరేశ్, గ్రామ పెద్దలు ఆవిష్కరించారు. గురువులు సత్యదేవ శర్మ, లక్ష్మీనారాయణ తదితరులను సత్కరించారు. ఉద్దండపురం హైస్కూల్‌లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠ్యాంశాలు బోధించారు. దేవవరంలో పల్లా సూర్యనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ మునుకుర్తి ఫణి ప్రకాశ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. రాజయ్యపేట, నక్కపల్లి, జానకయ్యపేట, వేంపాడు, గొడిచెర్ల, నక్కపల్లి తదితర పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు.

ఎస్.రాయవరం : ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి ముందుగా ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయులు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు.

కోటవురట్ల : గురుపూజోత్సవాన్ని మండలంలోని పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించారు. కోటవురట్ల జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు రామారావు, జోషిలను ఉపాధ్యాయులు, సిబ్బంది సత్కరించారు. కె.వెంకటాపురం జడ్పీ ఉన్నత పాఠశాలహెచ్ఎం షేక్ అల్లాపుద్దీన్‌ను సిబ్బంది సన్మానించారు. హైస్కూల్ హెచ్ఎం ఎం.లక్ష్మిని టీచర్లు, సిబ్బంది సత్కరించారు. రాజుపేట యూపీ స్కూల్‌లో హెచ్ఎం నానిమణిమోహన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను జరిపారు.

ఎలమంచిలి : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ గురువులను సత్కరించారు. బీసీ, ఎస్సీ బాలురు వసతి గృహాల అధికారులు అప్పలనాయుడు, రాజ్‌కుమార్ లను ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు మణికంఠ, కేశవ, తోటి విద్యార్థులు సత్కరించారు.

అచ్యుతాపురం : ఉపాధ్యాయ దినోత్సవాన్ని మం డలంలోని అన్ని విద్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాలకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అచ్యుతాపురం గ్రంథాలయంలో జరిగిన ఈ వేడుకల్లో లైబ్రేరి యన్ డి.కోటేశ్వరరావుతో పాటు పాఠకులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రాంబిల్లి : గురుపూజోత్సవాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించారు. మత్స్యకార గ్రామమైన వాడనర్సాపురం యూపీ పాఠశాల ఆవరణలో మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య ఆధ్వర్యంలో ఈ వేడుకల్లో రాంబిల్లి సీఐ నర్సింగరావు, డిప్యూటీ తహసీల్దార్ శేషు, గ్రామ పెద్దలు చోడిపల్లి తాతారావు తదితరులతో విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమా వేసి నివాళులర్పించారు. అనంతరం పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు ప్రసాద్ దంపతులను సత్కరించారు. ఎంపీడీవో రమేశ్‌నాయుడు, ఎంఈవో లక్ష్మణరావు, బీఎస్ఎన్ మూర్తి, సంఘం నేతలు గోవిందరావు, పైల దేవుడు, నాగరాజు వెంకటరమణ పాల్గొన్నారు.

‘బెజవాడ’ బాధితులకు అనిత బృందం బాసట

▸▸ 10వేల వాటర్ బాటిళ్లు, ఐదు వేల బిస్కెట్ ప్యాకెట్లతో ప్రత్యేక వాహనం

▸▸ తరలి వెళ్లి పంపిణీ చేస్తున్న నియోజకవర్గ టీడీపీ శ్రేణులు


హోం మంత్రి అనిత ద్వారా వరద బాధితులకు వాటర్ బాటిళ్లు పంపిణీ

నక్కపల్లి, సెప్టెంబరు 5 : విజయవాడ వరద బాధితులకు సాయం అందించేందుకు హోం మంత్రి వంగలపూడి అనిత అనుచరులంతా ఇక్కడి నుంచి తరలి వెళ్లారు. ఇందులో భాగంగా ఇక్కడి అడ్డరోడ్డు జంక్షన్ నుంచి నాలుగు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు లాలం కాశీనాయుడు, అమలకంటి అబద్దం, కొప్పిశెట్టి బుజ్జి, గుర్రం రామకృష్ణ, చించలపు పద్దు, గోసల శ్రీకాంత్ 10వేల వాటర్ బాటిళ్లను, ఐదువేల బిస్కట్ ప్యాకెట్లను వ్యాన్‌లో నింపి విజయవాడకు తీసుకెళ్లారు. నేరుగా హోంమంత్రి అనిత సమక్షంలో వాటర్ బాటిళ్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. అలాగే, పాయకరావుపేట ఐటీడీపీ బృందం భీమరశెట్టి శ్రీనివాసరావు, జి.రమేశ్ తదితరులు కూడా మూడు రోజుల నుంచి విజయవాడలోనే ఉంటూ వరద బాధితులకు సేవలు చేస్తున్నారు.

కొత్తూరులో ఎటు చూసినా వర్షపు నీరే


చెరువును తలపిస్తున్న శారదానగర్ ప్రధాన రోడ్డు

కొత్తూరు, సెప్టెంబరు 5 : అనకాపల్లి మండలం మేజర్ పంచాయతీ కొత్తూరులో గురువారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచి పోయింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఆ మార్గంలో రాకపోకలు చేసే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా రోడ్డు మధ్యలో పైపులైను మరమ్మతులకు గురికావడంతో గొయ్యి తవ్వేసి వదిలేశారు. ఈ గొయ్యి వర్షపు నీటితో పూర్తిగా నిండిపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

పలు ప్రాంతాల్లో భారీ వర్షం

... 5వ పేజీ తరువాయి

కశింకోటలో 25.4, రాంబిల్లిలో 21.8, మాడుగులలో 19.8, పరవాడలో 18.8, దేవరాపల్లిలో 14.2, ఎలమంచిలిలో 14.2, పాయకరావుపేటలో 13, ఎస్.రాయవరంలో 9.6, చోడవరంలో 9, నక్కపల్లిలో 7.6, కె.కోటపాడులో 3.6, చీడికాడలో 2.4, నాతవరంలో 2.2, అచ్యుతాపురంలో 2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నర్సీపట్నం, గొలుగొండ, రోలుగుంట, రావికమతం, కోటవురట్ల, మాకవరపాలెం మండలాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. జిల్లాలో మరో 24 గంటలపాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలు వున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మరో రెండు రోజులు కొనసాగించనున్నారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

... 5వ పేజీ తరువాయి

నిర్వహించాలన్నారు. గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం బెల్ట్ దుకాణాలు ఉండడానికి వీల్లేదని, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానాన్ని నియంత్రించాలని, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను తరచూ చేపట్టాలన్నారు. రౌడీ షీటర్లు, చెడునడత కలిగిన వారిపై నిఘా ఉంచాలని ఎస్పీ చెప్పారు. ఈ నెల 14వ తేదీన జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ కేసులకు సంబంధించి ఇరు పార్టీలకు కౌన్సెలింగ్ నిర్వహించి కేసులు తగ్గించాలని సూచించారు. అడ్డరోడ్డు కేంద్రంగా పనిచేస్తున్న ఎలమంచిలి ట్రాఫిక్ పోలీసులు ఇకనుంచి ఎలమంచిలి స్టేషన్ నుంచే విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఎస్పీ వెంట పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, స్థానిక సీఐ ఎస్.ధనుంజయరావు, ఎస్ఐలు కె.సావిత్రి, బి.రామకృష్ణ వున్నారు.

వేతనాల కోసం వెలుగు వీవోఏల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న వెలుగు వీవోఏలు

అనకాపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షించే వెలుగు వీవోఏలు (యానిమేటర్లు) వేతనాలు కోసం రోడ్డెక్కారు. గురువారం కలెక్టరేట్ ఎదుట వేతన బాకాయిలు చెల్లించాలంటూ ఆందోళన చేపట్టారు. ఈ ఏడాది మార్చి నెల నుంచి వేతనాలు చెల్లించడం లేదని, ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వీవోఏల సంఘ ప్రతినిధులు కోరారు. డీఆర్వో దయానిధికి వారి వద్దకు వెళ్లి సమస్య తెలుసుకున్నారు. వారంతా వినతి పత్రాన్ని అందజేశారు. వెలుగు వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రూపాదేవి, జిల్లా అధ్యక్షుడు సూరిబాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావుతో పాటు వివిధ మండలాల నుంచి వీవోఏలు పాల్గొన్నారు.

పూడిమడకలో మెరైన్ పోలీసులు ‘సాగర్ కవచ్’


తీరంలో కోస్టల్ పోలీసులు అధికారుల వాహన తనిఖీలు

అచ్యుతాపురం, సెప్టెంబరు 5 : పూడిమడక తీరంలో మెరైన్ పోలీసులు సాగర్ కవచ్ ఎక్సర్‌సైజ్‌ను రెండు రోజులు నిర్వహించారు. సముద్ర మార్గంగుండా దోపిడీదారులు, ఉగ్రవాదులు వస్తే ఎలా పట్టుకోవాలో శిక్షణలో భాగంగా తీరంలో బుధ, గురువారాల్లో ఈ ఎక్సర్‌సైజ్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా పూడిమడక ముఖద్వారం వద్ద, తీరంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో భారీగా తనిఖీలు జరిపారు. ఈ కార్యక్రమంలో కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ మెరైన్ ఎస్పీ పీవీఆర్ ఎస్ఎస్ఎస్ఎస్ఆర్ వర్మ, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, పూడిమడక మెరైన్ స్టేషన్ సీఐ సింహాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

‘మోడునైనా మొలకెత్తుతాను’ సంపుటి ఆవిష్కరణ


కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఎలమంచిలి, సెప్టెంబరు 5 : యువతకు మార్గదర్శకంగా నిలిచే రచనలు రావాలని, అప్పుడే వారు సన్మార్గంలో పయనిస్తారు ఎంపీపీ బోదెపు గోవింద్, చార్టెడ్ అకౌంటెంట్ బీఎస్ బంగారు శెట్టి అన్నారు. స్థానిక ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ సతివాడ రాంబాబు రాసిన ‘మోడునైనా మొలకెత్తుతాను’ కవితా సంపుటిని పట్టణంలోని కామాక్షి అమ్మవారి ఆలయ ఆవరణలో గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. వాకర్స్ క్లబ్, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు ఆడారి పూరీజగన్నాథం, సున్నం నాగేశ్వరావు, మడగల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ కోశాధికారి మద్దుర్తి రామారావుచే కచేరీ విశేషంగా ఆకట్టుకుంది.

జిల్లా పోలీసు కార్యాలయానికి ఫర్నీచర్


ఎస్పీ దీపికకు చెక్కు అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

అనకాపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సామాజిక బాధ్యతలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయానికి పరవాడ మండలంలోని మ్యాన్ కైండ్ ఫార్మా కంపెనీ యాజమాన్యం ఫర్నీచర్ సమకూర్చనుంది. ఇందులో భాగంగా కంపెనీ ప్రతినిధులు గౌరవ్, హానీ రిజ్వాన్, సురేష్ తదితరులు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దీపికను కలిసి ఈ మేరకు చెక్కు అందజేశారు. ఈ నిధులతో విజిటర్స్ చైర్లు, ఏసీలు, ప్రొజెక్టర్లు కొనుగోలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) దేవ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

లాలంకోడూరులో తాగునీటి సమస్యపై ఆరా

రాంబిల్లి, సెప్టెంబరు 5 : లాలంకోడూరులో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దుర్గాప్రసాద్, జేఈ వర్మ గురువారం పర్యటించారు. గ్రామంలో తరచూ తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నామని స్థానిక జనసేన నాయకుడు కశిరెడ్డి సర్వేశ్వరరావు ఇటీవల ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు సదరు అధికారులు గ్రామానికి విచ్చేసి సమస్యకు గల కారణాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, గ్రామ పెద్దలు సర్వేశ్వరరావు, వార్డు సభ్యులు పద్మ, రమణావు, కట్టా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పంటల సస్యరక్షణతో నాణ్యమైన దిగుబడులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 5 : సస్యరక్షణ చర్యలను సమగ్రంగా పాటించడం ద్వారా రసాయనాల అవసరం తగ్గించుకుంటూ తద్వారా నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ తెలిపారు. కొండకర్లలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు గురువారం వరిసాగు, సస్యరక్షణలపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. వరి పొలాంలోనే కాకుండా గట్లపై కూడా కలుపు లేకుండా శుభ్రం చేసుకోవటం ద్వారా చీడపీడల వ్యాప్తి ఆపవచ్చన్నారు. అనంతరం భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జి.తిరుమల రావు, శరగడం రామచంద్ర, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

తేగాడ కేజీబీవీలో ఉచిత వైద్య శిబిరం

కశింకోట, సెప్టెంబరు 5 : తేగాడలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కశింకోట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరావు, గైనకాలజిస్టు నిహారిక విద్యార్థినులకు పలు పరీక్షలు జరిపి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, కేజీబీవీ ప్రిన్సిపాల్ చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి

పరవాడ, సెప్టెంబరు 5 : ఓ లారీ డ్రైవర్ మృతిచెందడంతో అనుమానాస్పద మృతిగా పరవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలివి. పంజాబ్ రాష్ట్రానికి చెందిన గురుప్రీత్‌సింగ్ (50) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఫార్మాకు సంబంధించి కెమికల్ లోడుతో గురువారం ఫార్మాసిటీలో గల పార్కింగ్ ప్రదేశంలో లారీని నిలిపాడు. ఉదయం పదకొండు గంటల సమయంలో లారీ సీటులోనే కుప్పకూలిపోయాడు. ఇది గమనించిన తోటి డ్రైవర్లు లారీకి సంబంధించిన ట్రాన్స్‌పోర్టు సూపర్‌వైజర్‌కు సమాచారమిచ్చారు. సూపర్‌వైజర్ రామారావు వచ్చేసరికి అప్పటికే డ్రైవర్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నక్కపల్లిలో సీహెచ్‌సీ కార్మికుల నిరసన

నక్కపల్లి, సెప్టెంబరు 5 : మండల కేంద్రం నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల నుంచి కార్మికులకు వేతనాలు అందడం లేదన్నారు. వెంటనే వీరి సమస్యలు పరిష్కరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కేవీ బాబూరావు, ఎం.శివ, వి.ప్రసాద్, ధనలక్ష్మి, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

‘చవితి పందిళ్లకు అనుమతులు తప్పనిసరి’

సబ్బవరం, సెప్టెంబరు 5 : చవితి పందిళ్లకు అనుమతులు తప్పనిసరి అని సబ్బవరం సీఐ పిన్నింటి రమణ అన్నారు. ఇందుకోసం నిర్వాహకులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సమయపాలన విధిగా పాటించాలని, విగ్రహాల నిమజ్జనంలో ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

వైభవంగా భూలోకమాంబ పండగ



పరవాడ, సెప్టెంబరు 5 : మండల కేంద్రం పరవాడలో భూలోకమాంబ పండగ గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులతో పాటు సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడుదంపతులు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, కూటమి నాయకులు పైలా రామచంద్రరావు, రెడ్డి శ్రీను, పైలా చినఅక్కునాయుడు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను మేళతాళాల నడుమ ఊరేగించిన అనంతరం అనుపోత్సవం నిర్వహించారు.

పౌష్టికాహారంతోనే పిల్లలకు ఆరోగ్యం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి

పరవాడ, సెప్టెంబరు 5 : పౌష్టికాహారం తినిపించడం ద్వారానే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో వి.లలితకుమారి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పరవాడ ఒకటి, రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సూపర్‌వైజర్ షేక్ షకీలా, ఏఎస్ఎం రత్నం, అంగన్‌వాడీ టీచర్లు అర్జునమ్మ, పార్వతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు నివాళి


మదర్ థెరిసా విగ్రహం వద్ద టీడీపీ నేత సురేంద్ర నివాళి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5 : ఇక్కడి మెయిన్ రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయ జంక్షన్‌లో గురువారం మదర్ థెరిసా వర్ధంతి నిర్వహించారు. మదర్ థెరిసా ఫౌండేషన్ నిర్వాహకులు కర్రి కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు మళ్ల సురేంద్ర, సంఘ సేవకుడు కాండ్రేగుల శ్రీరాములు ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను కీర్తించారు.

పిడుగుపాటుకు పాడి పశువు మృతి

ఎస్.రాయవరం, సెప్టెంబరు 5 : మండలంలోని జంగులూరు పంచాయతీ పరిధి వెలంపాలెంలో గురువారం మధ్యాహ్నం పిడుగు పడి శ్రీపాదుల అప్పారావుకు చెందిన పాడి పశువు మృతి చెందినట్టు ఆ పంచాయతీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వజ్రపు శంకరరావు తెలిపారు. ఈ కారణంగా నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాల్సిందిగా కోరారు.

‘పేట’ సీఐగా అప్పన్న బాధ్యతలు

పాయకరావుపేట, సెప్టెంబరు 5 : పాయకరావుపేట సీఐగా జి.అప్పన్న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను గురువారం పలువురు రాజకీయ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో జడ్పీటీసీ లంక సూరిబాబు, ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, ధనిశెట్టి బాబీ, ఇసరపు తాతారావు, దేవవరపు రాజేష్‌ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

8న అనకాపల్లిలో రెండు జిల్లాల మాలల సదస్సు


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పాయకరావుపేట, సెప్టెంబరు 5 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక తీర్పును పునఃసమీక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల ఎనిమిదో తేదీన అనకాపల్లిలో నిర్వహించనున్న విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల మాలల సదస్సును అంతా విజయవంతం చేయాలని దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్, నెలపర్తి అర్జున్ తదితరులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక తాండవ జంక్షన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఇందుకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఎనిమిదో తేదీ ఉదయం 10 గంటలకు అనకాపల్లి గాంధీనగరం, రామాలయంవీధిలోని కేజేపీ ఫంక్షన్ హాల్‌లో జరిగే సదస్సుకు దళిత ముఖ్య నాయకులు మొర చంద్రశేఖర్ తదితరులు హాజరు కానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నెలపర్తి నాగరాజు, ఇంజరపు సూరిబాబు, తాటిపాక లోవరాజు, కువల కుమార్, పల్లా ప్రసాద్, ఐఎన్ మూర్తి, గారా చంటి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేయండి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం, సెప్టెంబరు 5 : వికసిత ఆంధ్ర కార్యక్రమం ప్రారంభానికి సంబంధించి ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు రాబోయే ఐదేళ్లలో చేపట్టాల్సిన అభివృధి పనులపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఇన్‌చార్జి ఏఎస్‌వో రమణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ భాను, సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీఎన్‌వీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డీసీ దృష్టికి కారిడార్ నిర్వాసితుల సమస్యలు


నిర్వాసిత రైతుల సమస్యలను ఎస్‌డీసీకి వివరిస్తున్న కొప్పిశెట్టి వెంకటేశ్

నక్కపల్లి, సెప్టెంబరు 5 : విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి మండలంలోని ఇంకా కొంతమంది రైతులకు పరిహారం అందలేదని, వారందరికీ న్యాయం చేయాలని నిర్వాసిత రైతులతో కలిసి టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ గురువారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణిని కోరారు. ఈ మేరకు ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో ఎస్‌డీసీని వెంకటేశ్, పలువురు నాయకులు కలిసి ఆయా నిర్వాసిత రైతుల జాబితాను వివరించారు. ఈ కార్యక్రమంలో గింజాల లక్ష్మణరావు, బుచ్చిరాజుపేట, అమలాపురం సర్పంచులు కాళ్ల శ్రీను, శంకరరావు, ఆర్.గోవింద్, పుణ్యమంతుల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నం : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు


కృష్ణాదేవిపేట : సర్వేపల్లికి నివాళులు..


మాకవరపాలెం : శెట్టిపాలెం స్కూలులో వేడుకలు


బుచ్చెయ్యపేట : వడ్డాది హైస్కూలులో సర్వేపల్లికి టీచర్ల నివాళి

జ్ఞానప్రదాత గురువు

- ఉపాధ్యాయ దినోత్సవాల్లో వక్తలు
- ఘనంగా టీచర్స్ డే
- పలువురు గురువులకు సన్మానం

నర్సీపట్నం, సెప్టెంబరు 5 : వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి విశ్రాంత ఎంఈవో జేఎస్ఎస్ నాగేశ్వరరావు పుష్పాంజలి ఘటించారు. అనంతరం గబ్బాడ జడ్పీ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు కె.సోమేశ్వరరావు, నర్సీపట్నం జెడ్పీహెచ్ స్కూల్ (తురకబడి) ఫిజికల్ సైన్స్ టీచర్ ఎల్.సుగుణ, వాకర్స్ క్లబ్‌లోని పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు ఎంపీ రంగారావు, కుప్పిలి స్వామి, సంయుక్త కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ బాబీ, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.గజ్జాలమ్మ పాల్గొన్నారు.

స్థానిక బాలాజీ గెస్ట్ హౌస్‌లో లయన్స్ క్లబ్ నవ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్ సీహెచ్ సన్యాసిపాత్రుడు, ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.చైతన్యకుమార్, కోశాధికారి, పి.వినోద్ పాల్గొన్నారు.

శ్రీవిద్య జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బోళెం దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

అలాగే శ్రీవిద్యాంజలి హైస్కూల్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. 70 మంది ఉపాధ్యాయులకు విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు, పిల్లలు ఆట, పాటలలో పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ యక్కల అక్షజ్ కృష్ణ, కరస్పాండెంట్ యక్కల శాంతి, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం ఏఎల్‌పురం, చోద్యం, కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట, నాగాపురం తదితర ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం ఘనంగా జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీహరి, అదనపు ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు, హెచ్ఎంలు నాగభూషణం, పల్లి సత్యనారాయణ, శ్రీను, ఈశ్వరి, పీహెచ్ రమణ, ఉపాధ్యాయులు టీవీ రమణ, కుందూరు నూకరాజు, రామరాజు, లోచల రమేష్, రామ్‌కుమార్, అచ్చుబాబు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు శెట్టిపాలెం స్థానిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయలను సన్మానించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అలాగే తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న కోసూరు రామును అక్కడ ఉపాధ్యాయులు సన్మానించారు.

బుచ్చెయ్యపేట : మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వడ్డాది కేపీడీ జడ్పీ హైస్కూలులో సర్వేపల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వడ్డాది మెయిన్ ప్రాథమిక పాఠశాల, కేపీ అగ్రహారం ప్రాథమిక పాఠశాల్లో వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు పీవీ శేషుబాబు, రవివర్మ, శేషగిరిరావు, సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు దొండా నారాయణమూర్తి, ఎస్ఎంసీ చైర్మన్‌లు కోవెల వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోడవరం : మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, ఇతర లెక్చరర్లు పాల్గొన్నారు. పట్టణంలోని బాలికల హైస్కూలులో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం రామిరెడ్డిని స్కూల్ కమిటీసభ్యులు సత్కరించారు.

నాతవరం : మండంలోని పలు విద్యాసంస్థల్లో గురువారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డు ఎంఈవో టి.అమృతకుమార్, రిటైర్డు టీచర్ కె.కోటయ్య ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, మాజీ జడ్పీటీసీ సభ్యులు కరక సత్యనారాయణ, ఎంపీడీవో హనుమంతరావు, తాండవ ప్రాజెక్టుకమిటీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీపీ ఎన్.విజయ్‌కుమార్, నర్సీపట్నం నియోజకవర్గ జనసేన నాయకులు రాజాన వీరసూర్యచంద్ర, వర్తక సంఘం అధ్యక్షుడు తూతిక నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : మండలంలోని పాఠశాలల్లో గురువారం ఘనంగా టీచర్స్‌డే జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువులకు నమస్కరించి చిన్నపాటి బహుమతులు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులను ఎంతో ఆదరాభిమానంతో ఉపాధ్యాయులు తమ చల్లని దీవెనలు అందించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

దేవరాపలి : మండల కేంద్రంలో గురుపూజోత్సవం సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంఈవో పడాల్‌దాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ విశ్రాంత ఉపాధ్యాయులు సింహాచలంనాయుడు, ఆదిరెడ్డి, చినకన్నబాబులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు. పలువురు ఉపాధ్యాయులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు సూరెడ్డి శ్రీనివాసరావు, బొకం ప్రసాద్, పీఆర్‌టీయూ నాయకులు ఆర్. సురేష్, మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, టీడీపీ మండల అధ్యక్షులు రొంగలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కె.కోటపాడులో జరిగిన వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు


దేవరాపల్లిలో ఉపాధ్యాయులకు సన్మానం

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, డీఈవో

రోలుగుంట, సెప్టెంబరు 5 : ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వైబీపట్నం ఎంపీపీ పాఠశాల హెచ్ఎం నరసింహమూర్తి, వెలంకాయలపాలెం ఎంపీపీ పాఠశాల హెచ్ఎం బి.సూర్యనారాయణ, రత్నంపేట ఎంపీపీఎస్ హెచ్ఎం కోనా రవికుమార్‌లను గురువారం కలెక్టర్ విజయ్ కృష్ణన్, డీఈవో వెంకటలక్ష్మమ్మ సన్మానించారు.

అసిస్టెంట్ వెటర్నరీ అసిస్టెంట్‌పై విచారణ

మాకవరపాలెం, సెప్టెంబరు 5 : గిడుతూరులో విధులు నిర్వహిస్తున్నజూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ డాక్టరు పెట్ల అప్పలస్వామినాయుడు పై వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం నక్కపల్లి పశుసంవర్ధక శాఖ ఏడీ వీర్రాజు, కోటవురట్ల ఏడీ సింహాద్రప్పుడు విచారణ చేపట్టారు. గత పది రోజుల కిందట గిడుతూరుకు చెందిన 15 మంది రైతులు పశు కేంద్ర జూనియర్ అసిస్టెంట్ డాక్టరుపై పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. పశువులకు సరిగ్గా మందులు ఇవ్వడం లేదని, విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, గడ్డి విత్తనాలు రైతులకు కాకుండా ప్రైవేటు వ్యక్తులకు అమ్మకాలు సాగించారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం చేపట్టిన విచారణకు ఫిర్యాదు చేసిన 15 మంది రైతుల్లో పలువురు గైర్హాజరయ్యారు.

కొందరు రైతుల ఫిర్యాదుపై విచారణ చేపట్టామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని విచారణాధికారులు తెలిపారు.

శెట్టి సత్తిబాబుకు ఘన నివాళి


సత్తిబాబుకు నివాళి అర్పిస్తున్న రాజేశ్ తదితరులు

గొలుగొండ సెప్టెంబరు 5 : కొత్తఎల్లవరం గ్రామ మాజీ సర్పంచ్ శెట్టి సత్తిబాబు చిత్రపటానికి నర్సీపట్నం మునిసిపాలిటీ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, స్థానిక సర్పంచ్ కొల్లి రాంబాబు, వార్డు మెంబర్లు స్వామినాయుడుతో పాటు పలువురు టీడీపీ నాయకులు గురువారం కొత్త ఎల్లవరంలో నివాళులు అర్పించారు. ఇటీవల సత్తిబాబు అనారోగ్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ సత్తిబాబు మృతి స్థానికంగా టీడీపీకి తీరనిలోటు అన్నారు. ఈ కార్యక్రమంలో దొరబాబు, గణేష్, శివకుమార్, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నరికిన టేకు చెట్లు నర్సీపట్నం రేంజ్ లోనివే..

- అటవీ శాఖ అధికారుల నిర్ధారణ

నర్సీపట్నం, ఆగస్టు 30 : నాతవరం సెక్షన్‌లో అక్రమంగా నరికిన టేకు చెట్లు నర్సీపట్నం రేంజ్ పరిధిలోవే అని అధికారులు నిర్ధారించారు. గత నెలలో వెదురుపల్లి, కృష్ణాపురం, అచ్చంపేట, సుందరకోట అటవీ ప్రాంతంలో టేకు చెట్లు నరికి అక్రమంగా తరలించారని నాతవరం మండలం గుణిపూడికి చెందిన మరిడయ్య సీసీఎఫ్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. మొదట్లో టేకు చెట్లు కృష్ణాదేవిపేట రేంజ్ పరిధిలోనివని అధికారులు భావించారు. తర్వాత క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి సుందరకోటలో ఆర్వోఎఫ్ఆర్ భూమిలోని చెట్లుగా గుర్తించారు. అక్కడ మూడు చెట్లు అక్రమంగా నిరకినట్టు నర్సీపట్నం రేంజ్ అధికారి లక్ష్మీనర్సు గుర్తించారు. ఫారెస్టు గార్డు ఎస్.రామకృష్ణ టేకు చెట్లు కలపను నర్సీపట్నం డిపోకు తరలించినట్టు రేంజర్ తెలిపారు. దీని మీద కేసు నమోదు చేశామని టేకుచెట్లు నరికిన వ్యక్తి కోసం గాలిస్తున్నామని తెలిపారు.

'పీఎం జన్‌మన్'తో మౌలిక వసతులు


లోవ గవరవరంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారాం

మాడుగుల రూరల్, సెప్టెంబరు 5 : పీఎం జన్‌మన్ కార్యక్రమంపై అవగాహన సదస్సును గురువారం జమ్మాదేవిపేట పంచాయతీ గిరిజన గ్రామాలైనలోవ గవరవరం, కొండలపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజారామ్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించే ఉద్దేశంతో పీఎం జన్‌మన్ అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాలరావు, ఐసీడీఎస్ మాడుగుల ప్రాజెక్ట్ పీవో శ్రీదేవి, సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి రమేశ్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి

మండల సమావేశంలో చోడవరం ఎమ్మెల్యే రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

రావికమతం, సెప్టెంబరు 5 : నియోజకవర్గంలో సమస్యల గుర్తించేందుకు పార్టీలకు అతీతంగా అందరు ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించనున్నట్టు చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. ఎంపీపీ పైలరాజు అధ్యక్షతన గురువారం రావికమతం వెలుగు కార్యలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయంలో ఏ పార్టీకి చెందిన వారైనప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధి చెప్పిన మాటకు విలువ ఇస్తామన్నారు. రెండు వేల ఎకరాలకు నిరాటంకంగా సాగు నీరు అందించే గుడ్డిప గొర్ల గెడ్డ మినీ రిజర్వాయర్ ప్రాంతం ఎంతో కాలంగా ఆక్రమణకు గురవుతోందని, దీని సరిహద్దులు గుర్తించడంతో పాటు అభివృద్ధికి సహకరించాలని గొంప, గుడ్డిప ఎంపీటీసీ, సర్పంచ్ గంజి సూర్యనారాయణ, గుమ్మాల గణేశ్వరావుకోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే తానే స్వయంగా అధికారులతో వచ్చి ఈ రిజర్వాయర్ పరిస్థితిని పరిశీలిస్తానన్నారు.

అంతకుముందు విద్యుత్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బీ అధికారుల పనితీరుపై పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఏ సమస్య తెలెత్తినా ఈ శాఖల అధికారుల కనీసం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఏఈ నందన్ పనితీరు అధ్వానంగా ఉందంటూ ఆరోపించారు. బీఎన్ రోడ్డులో అడుగడుగునా చెరువును తలపించే గుంతలు సంవత్సరాల తరబడి ఉన్నా ఆర్ అండ్ బీ శాఖ అధికారులు కనీసం గోతులైనా పూడ్చక పోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నబాబు, తహసీల్దార్ మహేశ్వరావు, వైస్ ఎంపీపీలు దంట్ల వెంకట రమణ, భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన కాలనీలు.. కూలిన ఇంటి మిద్దె


భారీ వర్షాల దెబ్బకు కూలిన ఇంటి మిద్దె

చోడవరం, సెప్టెంబరు 5 : అల్పపీడన ప్రభావంతో పట్టణంలో బుధవారం రాత్రి భారీగా వర్షం కురిసింది. రాత్రి పది గంటలు దాటిన తరువాత సుమారు గంటపాటు కురిసిన వర్షానికి పట్టణంలోని పూర్ణా థియేటర్ రోడ్డు, బాలాజీనగర్, రెల్లి కాలనీ తదితర ప్రాంతాల్లో వాన నీరు రోడ్లపై ఏరులా పారింది. బాలాజీనగర్‌లో మురుగునీటి కాలువలు పొంగిపొరడంతో వీధుల్లో వాననీరు నిల్వ ఉండిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా గురువారం మధ్యాహ్నం కూడా పట్టణంలో ఓ మోస్తరుగా వర్షం కురిసింది.

వర్షాలకు పట్టణంలోని శివాలయం వీధిలో నివాసం ఉంటున్న సుంకర సత్యవతి ఇంటి మిద్దె గురువారం మధ్యాహ్నం కూలిపోయింది. అదృష్టవశాత్తూ ఈ సమయానికి ఆమె బయట ఉండడంతో ప్రాణాపాయం తప్పింది. రెవెన్యూ అధికారులు కూలిన ఇంటిని పరిశీలించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు

కె.కోటపాడు, సెప్టెంబరు 5 : మండలంలోని గొట్లాం, పిండ్రంగి, సింగన్నదొరపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, తల్లులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీవో వి.మంగతాయారు మాట్లాడుతూ మహిళా సంబంధిత చట్టాలు (మిషన్ శక్తి), పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు, బేటీ బచావో, బేటీ పడావో, బేటీ పడావో, పౌష్టికాహారం ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎల్సీ సుశీల, ఎం.రాములమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు


పరిశీలిస్తున్న ఏడీ చిట్టినాయుడు

చీడికాడ, సెప్టెంబరు 5 : జాతీయ పశువ్యాధి నియంత్రణలో భాగంగా చెట్టుపల్లి, సిరిజాంలలో గురువారం నిర్వహించిన ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఏడీ చిట్టినాయుడు పరిశీలించారు. పాడిరైతులకు రైతు సేవా కేంద్రంలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు మండలంలోని 8200 పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు, 240 ఆడ పెయ్యలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. అనంతరం చీడికాడ పశువైద్యశాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

రోలుగుంట, సెప్టెంబరు 5 : ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ కౌన్సిలర్ మలసాల గణేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొవ్వూరు జడ్పీ పాఠశాలలో ఆ సంస్థ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా?' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దేముడు, హెల్త్ అసిస్టెంట్ కన్నబాబు, స్థానిక ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, చైల్డ్ ఫండ్ ప్రతినిధులు

అభివృద్ధికి సహకరించాలి

దేవరాపల్లి, సెప్టెంబరు 5 : గిరిజన గ్రామాల్లో పీటీజీ గిరిజనులను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు కృషి చేయాలని డీఎల్‌డీవో మంజుషావాణి అన్నారు. గురువారం సమ్మెద, వంతువాని పాలెం గ్రామాలను గుర్తించామన్నారు. ప్రధానమంత్రి ఆదేశాలు మేరకు ఈ గ్రామాలనుగుర్తించి మౌలిక సదుపాయాలను కల్పించి అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖరు, ట్రాన్స్‌కో ఏఈఈ క్రిశంకరరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కొళాయి నీటిలో తల వెంట్రుకలు



రావికమతం, సెప్టెంబరు 5 : మండలంలోని కొత్తకోటలో కొళాయిల ద్వారా చెత్తతో పాటు కోడి ఈకలతో కూడిన నీటి సరఫరా చేయడంపై గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గురువారం కుళాయిల ద్వారా వచ్చే నీటిలో కోడి, తల వెంట్రుకలుతో పాటు చెత్త కనిపించింది. దీనిపై స్థానికుడు నాగూర్ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే నీటి సరఫరా పైపులైన్ పగిలిపోయి వర్షపు నీరు, డ్రైనేజీలలో కలిసిపోవడంతో ఇలాంటి సరఫరా అయి ఉండవచ్చని కార్యదర్శి కృష్ణమోహన్ అన్నారు. తక్షణమే నీటి సరఫరా నిలిపి వేసి పైపలైన్ మొత్తం తనిఖీ చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో మరిడిమాంబ పండగ


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 5 : గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేట గ్రామ దేవతైన మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. వేకువ జాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి బోనాలు, గరగలు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పందిరి సత్యంనాయుడు, వైస్ సర్పంచ్ దుంపలపూడి సహదేవుడు, మువ్వల బుజ్జి, రమణ, కూటమి నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు : డీపీవో


చెత్తకుప్పలు చూసి ఆగ్రహం వ్యక్తంచేస్తున్న శిరీషారాణి

రావికమతం, సెప్టెంబరు 5 : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి హెచ్చరించారు. మండలంలోని రావికమతం, మేడివాడ, టి.అర్జాపురం, కొత్తకోట గ్రామాలలో గురువారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గ్రామాల పొలిమేరల్లో చెత్తకుప్పలు ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీలు, రక్షిత మంచి నీటి పథకాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి, కార్యదర్శులు పి.సత్యనారాయణ, స్వామి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

... 5వ పేజీ తరువాయి

నిర్వహించాలన్నారు. గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం బెల్ట్ దుకాణాలు ఉండడానికి వీల్లేదని, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానాన్ని నియంత్రించాలని, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను తరచూ చేపట్టాలన్నారు. రౌడీ షీటర్లు, చెడునడత కలిగిన వారిపై నిఘా ఉంచాలని ఎస్పీ చెప్పారు. ఈ నెల 14వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ కేసులకు సంబంధించి ఇరు పార్టీలకు కౌన్సెలింగ్ నిర్వహించి కేసులు తగ్గించాలని సూచించారు. అడ్డరోడ్డు కేంద్రంగా పనిచేస్తున్న ఎలమంచిలి ట్రాఫిక్ పోలీసులు ఇకనుంచి ఎలమంచిలి స్టేషన్ నుంచే విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఎస్పీ వెంట పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, స్థానిక సీఐ ఎస్.ధనుంజయరావు, ఎస్ఐలు కె.సావిత్రి, బి.రామకృష్ణ వున్నారు.

పలు ప్రాంతాల్లో భారీ వర్షం

... 5వ పేజీ తరువాయి

కశింకోటలో 25.4, రాంబిల్లిలో 21.8, మాడుగులలో 19.8, పరవాడలో 18.8, దేవరాపల్లిలో 14.2, ఎలమంచిలిలో 14.2, పాయకరావుపేటలో 13, ఎస్.రాయవరంలో 9.6, చోడవరంలో 9, నక్కపల్లిలో 7.6, కె.కోటపాడులో 3.6, చీడికాడలో 2.4, నాతవరంలో 2.2, అచ్యుతాపురంలో 2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నర్సీపట్నం, గొలుగొండ, రోలుగుంట, రావికమతం, కోటవురట్ల, మాకవరపాలెం మండలాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. జిల్లాలో మరో 24 గంటల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మరో రెండు రోజులు కొనసాగించనున్నారు.

సంక్షిప్తంగా..

సీఐ పైడపునాయుడు బాధ్యతల స్వీకారం



కె.కోటపాడు, సెప్టెంబరు 5 : కె.కోటపాడు నూతన సీఐగా పి.పైడపునాయుడు గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆయన వీఆర్ విశాఖపట్నం రేంజ్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానన్నారు. అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షిస్తామన్నారు. కాగా ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా ఉన్న బి.చిన్నస్వామినాయుడు శ్రీకాకుళంకు బదిలీ అయ్యారు.

దరఖాస్తులు ఆహ్వానం

రోలుగుంట, సెప్టెంబరు 5 : మండలంలోని గిరిజన గ్రామాలైన పిత్రిగెడ్డ, లోసింగిలకు ప్రభుత్వం ఎన్ఆర్ఎస్‌టీసీ (నాన్-రెసిడెన్షియల్) పాఠశాలను మంజూరు చేసినట్టు ఎంఈవో జగ్గారావు తెలిపారు. ఆయా పాఠశాలల్లో గిరిజన పిల్లలకు చదువు చెప్పడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు డీఎడ్ లేదా బీఎడ్ చేసి ఉండాలన్నారు. ఈ నెల 7లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వరద బాధితుల కోస ఆహారం తరలింపు

నర్సీపట్నం, సెప్టెంబరు 5 : సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి విజయవాడ వరద బాధితుల కోసం ఆర్డీవో జయరాం వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు పంపించారు. గురువారం ఏవో సూర్యనారాయణ ప్రత్యేకంగా వ్యాన్ ఏర్పాటు చేసి 35 వేలు మంచినీళ్ల బాటిల్స్, 50 వేల బిస్కెట్ ప్యాకెట్లు విజయవాడ పంపించారు.

న్యాయ అవగాహన సదస్సు

నర్సీపట్నం, సెప్టెంబరు 5 : అంబేడ్కర్ గురుకులం (బాలికలు) పాఠశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి.షియాజ్‌ఖాన్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిత్ విద్యార్థినులకు ఉపాధ్యాయ దినోత్సవం ప్రాధాన్యత గురించి వివరించారు. చట్టాలు మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కోసూరి అప్పలనాయుడు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

స్వయంభూ గణేశుని మాలధారణ

చోడవరం, సెప్టెంబరు 5 : పట్టణంలోని ప్రముఖ స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో గణేశ్ మాలధారణను గురువారం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి గణపతి హోమం నిర్వహించి భక్తులకు మాలధారణ చేపట్టారు. ఈ దీక్షాకార్యక్రమంలో గణేశ భక్తులు మాల ధరించారు.

2 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం


వెంకన్నపాలెం వద్ద నిలిచిపోయిన వాహనాలు

చోడవరం, సెప్టెంబరు 5 : మండలంలోని వెంకన్నపాలెం జంక్షన్ సమీపంలో గురువారం మధ్యాహ్నం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అనకాపల్లి నుంచి చోడవరం వైపుగా వస్తున్న బస్సు రోడ్డు పక్కకు దిగిపోయి అడ్డంగా ఉండిపోవడంతో అనకాపల్లి, చోడవరం, విశాఖపట్నం మార్గంలో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

డిగ్రీ కళాశాల మంజూరుకు వినతి

దేవరాపల్లి, సెప్టెంబరు 5 : మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తికి ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీను గురువారం వినతి పత్రం ఇచ్చారు.

ముంపులో బాలాజీనగర్ కాలనీ


నివాసాల మధ్య నిలిచిన వర్షం నీరు

చోడవరం, సెప్టెంబరు 5 : పట్టణంలో బుధ, గురువారాల్లో కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పలు కాలనీలు నీటముంపునకు గురయ్యాయి. బాలాజీనగర్, పూర్ణా థియేటర్ రోడ్డు, రెల్లి కాలనీ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం ఉదయానికి కూడా పట్టణంలోని బాలాజీనగర్ ప్రాంతంలోని నివాసగృహాల మధ్య వాననీరు నిలిచిపోయింది. వర్షానికి మురుగునీరుతో పాటు, వాననీరు ఇంట్లోకి రావడంతో స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

చేపల చెరువుల నిర్వాహకులకు నోటీసులు

దేవరాపల్లి, సెప్టెంబరు 5 : మండలంలో అనధికారికంగా చేపలు చెరువులు నిర్వహిస్తున్న యజమానులకు మత్స్యశాఖ సహాయకురాలు కీర్తి గురువారం నోటీసులు జారీ చేశారు. కుళ్లిన మాంసం వ్యర్థాలు వేసిన క్యాట్ ఫిష్ పెంచితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దేవరాపల్లి, సంజీవపురం, కొత్తపెంట, తారువ, మారేపల్లి, గ్రామాల చేపల చెరువుల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు.

మట్టి విగ్రహాలు పంపిణీ

నర్సీపట్నం, సెప్టెంబరు 5 : పర్యావరణ పరిరక్షణ కాంక్షిస్తూ గురువారం పట్టణానికి చెందిన ఊడా సూర్యారావు, అడపా రాజు, కోట శ్రీనివాసరావు 500 మట్టి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ అధికారి గోపాలరావు ఆస్పత్రి పక్కన శుక్రవారం కూడా మట్టి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షిద్దామని పిలుపునిచ్చారు.